**కథ**

# అమ్మకున్న చెట్టు

సాంబమూర్తిగారి తల్లి తద్దినం ఆరోజు. వంట పనికి వచ్చిన గంగలక్ష్మమ్మ పని ముగించుకుని బయల్దేరబోతుంటే, ఆ ఇంటి పెద్దకోడలు కావేరి డబ్బు తెచ్చిచ్చింది. లెక్క చూసుకుని ఎక్కువ ఉన్న ఏభై నోటు తిరిగి ఇవ్వబోతుంటే తీసుకోకుండా, లోపలికెళ్ళి చీర, రవిక తెచ్చి గంగలక్ష్మమ్మ చేతిలో పెట్టింది.

''ఎందుకమ్మా! నాకివేమీ వద్దు. నే చేసిన పనికి ప్రతిఫలం తీసుకున్నాను, చాలు'' అనంటే-

''అలా అనకండి, మా ఇంట్లో ఏ సందర్భం వచ్చినా, కాదనకుండా వస్తున్నారు. మా తృప్తి కోసం తీసుకోండి'' అని సాంబమూర్తి కల్పించుకోవటంతో కాదనలేకపోయింది.

పదేళ్ళ క్రితమైతే గంగలక్ష్మమ్మకి ఇలా బయట పన్లకి రావాల్సిన అగత్యం లేదుమరి. చిన్నవయసులోనే భర్త మరణించినా, ఉన్న ఒక్కగానొక్క కొడుకు కోసం, ఉన్నదంతా ఖర్చుచేసి ఇంజనీర్ని చేసింది. కొడుకు మురళికి మంచి ఉద్యోగమూ వచ్చింది. అందరి తల్లుల్లాగే కొడుక్కి పెళ్ళి చెయ్యాలని ఆశపడ్డది గంగలక్ష్మమ్మ. అణకువ గల కోడల్ని ఆమె ఆశిస్తే, అందం, ఐశ్వర్యంతోబాటు ఉద్యోగం ఉన్న భార్యని ఎంపిక చేసుకున్నాడు మురళి. కొడుకు అభీష్టానికి అడ్డు నిలవలేదు గంగలక్ష్మమ్మ. ఇన్నేళ్ళూ అనుభవించిన కష్టాలు గట్టెక్కుతాయనుకున్న గంగలక్ష్మమ్మ, కొత్త కష్టాలు కోడలి రూపంలో ప్రత్యక్షమౌతాయని ఊహించలేకపోయింది.

కోడలు సుందరి ధాష్టీకం ముందు, ఇంట్లో జీతం భత్యం లేని పనిమనిషి కమ్ వంటమనిషిలా స్వతంత్రం లేని జీవితాన్ని మనసంగీకరించకపోయినా, కడుపుతీపి కోసం సర్దుకుపోయేది. పగలంతా చాకిరీ చేసి, సాయంత్రం కాసేపు టి.వి ముందు కూచుంటే చాలు, ఏదో ఒక పని పురమాయించటమో, లేకుంటే అత్తగారు చూస్తున్న ఛానల్ మార్చి, ఆమెకు అర్థంగాని ఇంగ్లీష్ ఛానల్స్ కూచుని మరీ చూసేది. సాయంత్రాలు భార్యాభర్తలు బయట సినిమాలు, షికార్లకెళ్ళొచ్చేసరికి సకలమూ సిద్ధం చేసినా, ఏదో ఒక వంకతో అత్తగార్ని ఆరళ్ళు పెట్టటం సుందరి దినచర్య అయింది. భార్య మాటలు, చేతలు సమర్థించేవిగా లేకపోయినా, ఆమె మాటల పారవశ్యం, చేతల చాకచక్యం, నెల తిరిగేసరికి చేతిలో తెచ్చిపోసే నోట్ల ఆధిపత్యం మురళిని నోరు మెదపకుండా చేశాయి.

పక్కింటి సరస్వతమ్మగారు తన వయసువాళ్ళని ఓ పదిమందిని జత చేసుకుని కాశీ రామేశ్వరం వెళ్ళాలని ప్లాన్ చేసి గంగలక్ష్మమ్మనీ రమ్మని, రాకపోకలకయ్యే ఖర్చుల వివరాలు చెప్పింది. ఆరోజు రాత్రి కొడుకుతో విషయం చెప్పేసరికి, తల్లి మాట కాదనలేక 'సరే' అంటున్న మురళిని, లోపలికి పిల్చింది సుందరి. కాసేపటికి బయటికి వచ్చిన మురళి మౌనాన్ని అర్థం చేసుకున్న గంగలక్ష్మమ్మ, కొడుకు మీద ఇంకా తనకు అధికారం మిగిలుందన్న భ్రమతో, అతనికోసం తను పడ్డ కష్టాల్ని గుర్తుచేస్తుంటే, లోపల్నుంచి వేగంగా వచ్చి సుందరి అన్న మాటలు గంగలక్ష్మమ్మకి నవనాడులూ క్రుంగిపోయేలా చేశాయి.

''అమ్మకున్న చెట్టు నీడన ఉండనిస్తున్నది చాలక కాయలు కావాలంటే కోసుకోనిస్తారా! ఓ మనిషిని కూచోబెట్టి సకలమూ జరపాలంటే ఎంత కష్టమో మీకు తెలియదల్లే ఉంది. తిండి, బట్టకీ లోటు లేకుండా చూస్తుంటే సంతోషపడక, కాశీ రామేశ్వరాలని గొంతెమ్మకోర్కలు కోరితే మా వల్లయ్యే పనికాదు. కష్టం, సుఖం తెలియని ఆవిడేదో అడిగిందని గంగిరెద్దులా మీరూ 'సరే' అంటున్నారా! లోపలికి రండి'' సుందరి ఝళిపింపునకు మురళి లోపలికెళ్ళాడు.

ఆత్మాభిమానం దెబ్బతిన్న గంగలక్ష్మమ్మ ఆరాత్రి అన్నం తిన్లేదు, నిద్రపోలేదు.

మర్నాడుదయం కొడుకుతో చెప్పి, పుట్టిపెరిగిన పల్లెటూళ్ళో పాతికేళ్ళ తర్వాత అడుగుబెట్టింది. తనలాంటి మరో అభాగ్యురాలు వరలక్ష్మమ్మ ఆసరాగా దొరకటంతో, తనకు తెలిసిన వంటపనిలో స్థిరపడ్డది.

రెణ్ణెల్ల తర్వాత ఓ రెండొందలు పంపాడు మురళి. గంగలక్ష్మమ్మ ఆ డబ్బు తిరిగి పంపించింది. అంతే..అప్పట్నుంచి ఇప్పటివరకూ నెలలు, సంవత్సరాలు గడిచినా కొడుకు నుండి తన నెతుక్కుంటూ ఏనాడూ పావలా కార్డు కూడా రాలేదు.

ఆలోచిస్తూ నడుస్తున్న గంగలక్ష్మమ్మ కళ్ళ ముందు గతమంతా గిర్రున తిరిగి ఆగేసరికి ఇంటి ముందుకొచ్చింది.

ఇంటిముందు తళతళా మెరుస్తున్న కారు ఆగటం, చూసి వేగంగా లోపలికెళ్ళింది. తమ పాత కుర్చీలో కూచుని వరలక్ష్మమ్మతో మాట్లాడుతున్న మురళిని చూసి, క్షణం నివ్వెరపోయి ఆగింది. తల్లిని చూసి తెచ్చిపెట్టుకున్న నవ్వు పులుముకుని, ''అమ్మా'' అనేసరికి, గబగబా కొడుకు పక్కకెళ్ళి, ''ఎంతసేపయింది బాబూ వచ్చి'' అంది.

''అర్ధగంటయింది''

''సుందరి, పిల్లలు బాగున్నారా?''

''ఆ'' అన్నాడు తలదించుకుని. ఎ.సి.కి అలవడిన అతని శరీరం స్వేదాన్ని కారుస్తుంటే విశనకర్ర తెచ్చిచ్చింది. లోపలికెళ్ళి, ఎవరింటి పెళ్ళి కోసమో చేసిన లడ్లు రెండు, కాసిని జంతికలు ప్లేటులో తెచ్చి కొడుక్కిచ్చింది. తల్లి చేతి రుచికి మొహం వాచిన అతని నోరు మౌనంగా తన పని ప్రారంభించింది.

''మురళి కాస్త వళ్ళు చేసినట్టున్నాడు'' తింటున్న కొడుకు వైపు ఆమె మాతృప్రేమ పైనుండి, కిందికి చూసుకుంది. తల్లి ఇచ్చిన చల్లని మంచినీళ్ళు తాగి, మెల్లగా ప్రారంభించాడు మురళి.

''సుందరి ఎప్పుడూ నిన్ను గురించే అనుకుంటుందమ్మా. ఎన్నోసార్లు నిన్ను తీసుకురమ్మంది. జరిగినదానికి ఎంతో బాధపడ్తోంది. 'నాకు తెలిసీ తెలియక అత్తయ్యను అవమానపరిస్తే, నాలుగు తగిలించైనా నాకు బుద్ధి చెప్పకూడదా మీరు!' అనంటుంది. ఎన్నోసార్లు ఇద్దరం వచ్చి నిన్ను తీసుకెళ్దామనుకున్నాం. ఏవో పన్ల వత్తిళ్ళు.

అమ్మా! నేను కంపెనీ పని మీద ఆర్నెల్లు అమెరికా వెళ్ళాలి. నాకీ మధ్య కొద్దిగా 'షుగర్ వ్యాధి' వచ్చింది. అందుకని ఏది బడితే అది తినొద్దన్నారు డాక్టర్లు. నాతో సుందరీ వస్తోంది. ఇల్లూ, పిల్లల్ని చూసుకోవడానికి బయటివాళ్ళెవర్నీ నమ్మి ఉంచలేము. పోనీ సుందరి తల్లిదండ్రుల్ని ఉంచుదామంటే వాళ్లు కొడుకుతోబాటు అమెరికాలో ఉంటున్నారు. అందుకని జరిగిందేమీ మనసులో ఉంచుకోకుండా, నువ్వు వచ్చావంటే, మేం నిశ్చిం

తగా వెళ్ళొస్తాం''
పెళ్లాం చెప్పిన పాఠం అప్పజెప్పాడు.

కొడుకు ఆంతర్యం అర్థం చేసుకున్న గంగలక్ష్మమ్మ ''ఎప్పుడు బయలుదేరాలి నేను'' అంది.


★ ★ ★

హైదరాబాదులో మురళి కట్టిన అధునాతన బంగళాలో ఎనిమిదేళ్ళ మనవడు, నాలుగేళ్ళ మనవరాలితో ఆర్నెల్లు ఆరురోజుల్లా గడిచిపోయాయి.

★ ★ ★

ఆర్నెల్ల తర్వాత- మురళి, సుందరి తిరిగొచ్చారు. రెండ్రోజుల తర్వాత అంతకు ముందు పనిచేసిన వంటమనిషి పనిలో పునఃప్రవేశించడంతో, తనొచ్చిన పనైపోయిందని గ్రహించిన గంగలక్ష్మమ్మ, ఆఫీసుకు బయల్దేరుతున్న కొడుకుతో అంది ''బాబూ మురళీ! ఈవేళ నేను ఊరికి బయల్దేరుతున్నాను.''

''అప్పుడే ఏం తొందరమ్మా! ఇంకో నాల్రోజులుండొచ్చు గదా!''



''నాల్గురోజులున్నా తిరిగి వెళ్ళాల్సింది అక్కడికే గదా!''

అపుడే సుందరి ఆఫీసుకి బయల్దేరుతూ, హాల్లోకి రావటంతో ''ఆ..అవునవును, పల్లెటూళ్ళో ఉండే ప్రశాంతత బస్తీల్లో ఎక్కడ దొరుకుతుంది. జాగ్రత్తగా వెళ్ళిరామ్మా'' అని పర్సుతీసి రెండు వందలు తీసి, ఛార్జీలకోసమన్నట్టు ఇవ్వబోతుంటే-

''మురళీ! ఊళ్ళో నేను ఎవరింటికెళ్ళి వంట చేసినా రోజుకి వందరూపాయలు తీసుకుంటాను. ఇక్కడ ఆరునెలలుగా నీ పిల్లలకి రోజుకి మూడు పూటలా వండిపెట్టి, అదనపు పన్లూ చేశాను. లెక్కచూస్తే పద్దెనిమిది వేల రూపాయలు దాటుతుంది'' అంది.

''ఏం మాట్లాడుతున్నావమ్మా! నా పిల్లలు నీకు మనుమలు కారా? వాళ్ళకి వండిపెట్టి డబ్బు అడగటం అసహ్యంగా అన్పించటం లేదూ'' అన్నాడు ఆవేశంగా.

''అందుకే బాబూ! ఖచ్చితంగా పద్దెనిమిది వేలు ఇవక్కర్లేదు. పదివేలివ్వు చాలు'' అంది కరాఖండీగా.

''ఆయన మీ కొడుకన్న సంగతి గుర్తుండే మాట్లాడుతున్నారా?'' అందుకుంది సుందరి.

''ఎందుకు లేదు తల్లీ! బాగా గుర్తుంది. వాడు నీకు నేను అమ్మిన చెట్టు. అమ్ముకున్నవాళ్ళకీ, కొనుక్కున్నవాళ్ళకీ మధ్య 'వ్యాపార సంబంధాలు' తప్ప, ఆప్యాయతానుబంధాలు పొసగవు. ఇవ్వాళ మీ అవసరానికి నేను 'నమ్మకమయిన వంటమనిషిని' మాత్రమే. అనవసరపు మాటలతో ఒకళ్ళనొకళ్ళు నిందించుకునేకంటే, నా డబ్బు నాకిప్పిస్తే, నే వెళ్తాను.

లోపలికెళ్ళి పదివేల రూపాయల కట్ట తెచ్చి టీపాయ్ మీద విసిరేసింది సుందరి.

చిర్నవ్వుతో తీసుకుని వెళ్ళబోతూ, జరుగుతున్నదేమిటో అర్థంగాక చూస్తున్న మురళి పిల్లల్ని దగ్గరకు తీసుకుని ''జీవితంలో మిమ్మల్ని చూస్తానని, మీతో గడుపుతాననీ అనుకోలేదు. ఈ ఆర్నెల్లూ ''నానమ్మా'' అని పిలిచి ఆ లోటు తీర్చారు. ఈ పేద వంటమనిషిని మీరైనా గుర్తుంచుకోండి'' అని కళ్ళు తుడుచుకుని, చేతిలో ఉన్న నోట్లకట్టలో కొంతతీసి పిల్లలకి చెరోసగం ఇస్తుంటే-

'అమ్ముడుపోయిన చెట్టులా' బిత్తరపోయి చూస్తూ నుంచున్న మురళి వైపు జాలిగా చూసి, వేగంగా బయటక్కదిలింది ఆత్మాభిమానంతో, ఆత్మస్థైర్యాన్ని అండ చేసుకున్న గంగలక్ష్మమ్మ. ★

ఎం.వెంకటేశ్వరరావు